ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి



జిల్లా వార్తలు

5★

ఆదివారం 3 ఆగస్టు 2025

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

- రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం

పెద్దపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి పలువురు రాష్ట్ర మంత్రులు ఆదివారం జిల్లాకు రానున్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటించనున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్ నుంచి ఉదయం 9 గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా 10:30 గంటలకు రామగుండం మండలం గోలివాడ హెలి ప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి అంతర్గాం చేరుకుని రామగుండం ఎత్తిపోతల పథకాన్ని మంత్రులు ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి ధర్మారం మండలం నంది మేడారం హెలీక్యాప్టర్‌లో చేరుకుని ధర్మారంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్‌కు చేరుకోనున్నారు. మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం, చొప్పదండి నియోజకవర్గం రామడుగులో జరిగే కొత్త రేషన్ కార్డుల పంపిణీలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల పాల్గొని సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.



నవోదయ విద్యాలయాన్ని నెలకొల్పాలి

- జిల్లా ఏర్పాటై ఎనిమిదేళ్లు గడిచినా మంజూరు లేదు
- సీబీఎస్ఈ విద్యకు నోచుకోని పేద, మధ్య తరగతి విద్యార్థులు
- ఎంపీ, మంత్రులు దృష్టి సారించాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా ఏర్పాటై ఎనిమిదిన్నరేళ్లు గడుస్తున్నా కూడా కేంద్రీయ నవోదయ విద్యాలయానికి నోచుకోలేదు. గతంలో ఉన్న విద్యాలయాలకు తోడు కేంద్రం ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు కొత్తగా నవోదయ విద్యాలయాలను మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచే వాటిని ఆరంభిస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పాత ఉమ్మడి జిల్లాలకు ఒక్కో నవోదయ విద్యాలయం కొనసాగుతున్నది. కరీంనగర్ జిల్లా చొప్పదండి, ఆదిలాబాద్. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా నాగర్ కర్నూల్, మెదక్ జిల్లా సిద్దిపేట, నల్గొండ, నిజామాబాద్ జిల్లా కామారెడ్డి, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు కొనసాగుతున్నాయి. కొత్తగా నిజామా బాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మేడ్చల్ మల్కా జిగిరి, మహబూబ్‌నగర్, సూర్యాపేట్, సంగారెడ్డి జిల్లా లకు నవోదయ విద్యాలయాలు మంజూరయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అప్పటి ముఖ్యమంత్రి పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్ జిల్లా మినహా 9 ఉమ్మడి జిల్లాలను విభజించారు. మొత్తం 33 జిల్లాలతో రాష్ట్రం నడుస్తున్నది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలుగా విడి పోయింది. కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే నవోదయ పాఠశాల ఉండగా, తాజాగా జగిత్యాల జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు కాగా, ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ఆరంభం అవుతు న్నాయి. పెద్దపల్లి జిల్లాకు నవోదయ విద్యాలయం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుక రాకపోవడం వల్లనే జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు కాలేదు. భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాలు మినహా యిస్తే బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్ల మెంట్ నియోజకవర్గాల పరిధిలోని జిల్లాలకు నవోదయ విద్యాలయాలు మంజూరు చేశారు.

● సీబీఎస్ఈ బోధనకు నోచుకోని విద్యార్థులు

పెద్దపల్లి జిల్లా పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా వృద్ధి చెందుతున్నప్పటికీ, పేద, మధ్య తరగతి కుటుం బాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పరంగా సీబీ ఎస్ఈ విద్యకు నోచుకోవడం లేదు. జిల్లాలో ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి, రైస్ ఇండస్ట్రీస్ వంటివి అనేక పరిశ్రమలున్నాయి. నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన చేస్తారు. ఒకసారి సీటు దక్కించుకున్న విద్యార్థి ఇంటర్ పూర్తి చేసిన తర్వాతనే బయటకు వస్తారు. ఇక్కడ హాస్టల్ వసతితోపాటు సైన్స్, గణితంలో విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దుతారు. అంతేగాకుండా

(మిగతా 8వపేజీలో)

దీక్షను విజయవంతం చేయాలి



దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాగృతి నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును పార్లమెంట్‌లో అమలు చేసి 42శాతం రిజర్వేషన్లను వెంటనే కల్పించాలని జాగృతి జిల్లా అధ్యక్షుడు పెంట రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఇందిరాపార్క్ వద్ద జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 72గంటలు దీక్షను చేపట్టనున్నట్టు, జాగృతి యూపీఎఫ్ సంయుక్తంగా నిర్వహించే ఈ దీక్ష విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో 42శాతం బిల్లు ఇవ్వాలని తీర్మానం చేసి పంపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా పెండింగ్‌లో పెడుతుందని, మరో మార్గంలో ఆర్డినెన్స్ ద్వారా బిల్లును ఆమోదింప చేయాలని గవర్నర్‌కు పంపారని, ఆర్డినెన్స్ ద్వారా అయినా 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా అయితే పాల్గొన్నారో 72 గంటల దీక్ష శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెద్దపురం కుమారస్వామి, సదానందం, బండారి శ్రీనివాస్, బొగ్గుల సాయికృష్ణ, సకినాల ప్రతాప్, నిట్టూరి రాజు, భూమేష్ పాల్గొన్నారు.

పలు పుణ్యక్షేత్రాలకు ఖని నుంచి ప్రత్యేక బస్సులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి ఈ నెల 11న మధ్యాహ్నం బాసర, షిరిడీ, త్రయంబకేశ్వర్, శనిశంగనాపూర్‌కు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్టు ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల యాత్రకు పెద్దలకు రూ.4500, పిల్లలకు రూ.3200చార్జీగా నిర్ణయించారు. 17న మధ్యాహ్నం 3గంటలకు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, విష్ణుకంచి, శివకంచి, జోగులాంబ ఆలయాలకు పెద్దలకు రూ.5600, పిల్లలకు రూ.4400గా నిర్ణయించామని, నాలుగు రోజుల యాత్ర ఉంటుందన్నారు. 22న మానసదేవి ఆలయం, చిలుకూరి బాలాజీ, వర్గల్, మునిచింతల సమతామూర్తికి ఒక రోజు యాత్రకు పెద్దలకు రూ.1350, పిల్లలకు రూ.1100గా నిర్ణయించామని తెలిపారు. 25న ఉదయం 5గంటలకు యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, కొలనుపాక పెద్దలకు రూ.1100, పిల్లలకు రూ.800గా పేర్కొన్నారు. 28న రాత్రి 10గంటలకు ఝూరసంగం, బీదర్, రెంచింతల్‌కు పెద్దలకు రూ.1600, పిల్లలకు రూ.1250గా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. వివరాలకు 7013504982, 7989847927, 9908138036 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

● మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు కృషి ● రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

మంథని/మంథనిరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథని మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందటానికి స్పెషల్ ఇండస్ట్రి యల్ పార్కును మంథని శివారులో ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. వారికి వ్యాపార రంగంలో నైపుణ్యాల శిక్షణ ఇప్పించడానికి వీ-హబ్ ఉప కేంద్రాన్ని పెద్దపల్లిలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద డెయిరీ, పౌల్ట్రీ ఫాంల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మంథనిలో కుట్టుమిషన్ శిక్షణ ఏర్పాటు చేశామని, రాబోయే కాలంలో కొన్ని కంపెనీల ఏర్పాటు కోసం ప్రతిపాదనలకు యోచిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టామన్నారు. రైతులకు ఒక సంవత్సరంలోనే 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి వారికి రెండు లక్షల రుణ మాఫీ పూర్తి చేశామన్నారు. రైతుల కోసం రూ.9 వేల కోట్ల రైతుభరోసా డబ్బులు విడుదల చేశామన్నారు. తొలి ఏడాదిలోనే 60 వేల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులకు నూతన రేషన్ కార్డులను అందిస్తున్నామన్నారు. దీన్ని ద్వారా ప్రతీ కుటుంబానికి సగటున నెలకు రూ.12 వందల విలువ గల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. రూ. 2వందల కోట్లకు పైగా మహిళల ఉచిత ప్రయాణానికి జీరో టిక్కెట్లు జారీ చేసి రూ.6,680 కోట్లను ప్రభుత్వం చెల్లించిందన్నారు. పేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. మంథని నియోజకవర్గంలో మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. యేటా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వ భూములు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు కట్టించే సంకల్పం చేస్తున్నామన్నారు. గురు కుల విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు పెంచామన్నారు. అడవిసోమన్‌పల్లిలో రూ.2 వందల కోట్లు ఖర్చు చేసి కార్పొరేట్‌కు దీటుగా ఇంటిగ్రే టేడ్ గురుకుల పాఠశాలను నిర్మిస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, మహిళలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ శ్రీహర్ష

ప్రారంభోత్సవాలు..

మంథని మున్సిపాలిటీ పరిధిలో రూ.6.70 కోట్లతో నిర్మించిన పాత పెట్రోల్ పంపు సమీపంలో సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే క్యూర్‌కోడ్ మెటీరియల్ హైస్కూల్ విద్యార్థులకు అందజేశారు. వన మహోత్సవంలో మొక్కలు నాటారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నమూనా ఇందిరమ్మ ఇంటిని, మున్సిపాలిటీలో రూ.20.50 కోట్లతో 410 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పైలాన్ శంకుస్థాపన చేశారు. ఈజీఎస్ నిధులు రూ.1.70 కోట్లతో నిర్మించే గ్రామ పంచాయతీల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఏఎంసీ కార్యాలయం వద్ద పాలకవర్గాన్ని సన్మానించారు. ఆర్ఆర్ గార్డెన్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు, సీఎం ఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్న య్యగౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు.

తెలంగాణ కోసం మంత్రి పదవిని వదులుకున్నా

● అవినీతికి పాల్పడకుండా ప్రజలకు మేలు చేసేందుకే పని చేస్తాం ● రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్

పెద్దపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని పార్టీల ఎంపీలను కలుపుకుని ఉద్యమించామని, అప్పుడు తనకు కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం వచ్చినా తెలంగాణ కోసం వదులుకున్నానని రాష్ట్ర గనులు, భూగర్భ, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం రాత్రి పెద్దపల్లిలో నిర్వహించిన ఆత్మీయ పౌర సన్మానంలో పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి కాకా వెంకటస్వామి ద్వారా ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. విశాఖ ట్రస్టు ద్వారా పెద్దపల్లి పార్ల మెంట్ పరిధిలోని 2 వేల ప్రభుత్వ పాఠశాలల్లో బోరింగులు వేసి ఫర్నీచర్ ఇచ్చామన్నారు. కాకా చేసిన పోరాటం వల్ల తనకు సింగరేణి నుంచి పింఛన్ వస్తున్నదని ఓ గని కార్మికుడు గుర్తు చేసిన విషయాన్ని తెలిపారు. కాకా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రేషన్ షాపులను తీసుక వచ్చారని, తాను మంత్రిగా రేషన్ కార్డులు పంపిణీ చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 300 మంది ఆత్మ బలిదానం చేసుకుంటే ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున ఇచ్చామన్నారు. ఎంపీగా నియోజకవర్గంలో 700 కోట్లతో తాగునీటి పథకాలు తీసుక వచ్చి, రోడ్డు నిర్మాణ పనులు చేయించానని చెప్పారు. నష్టాలతో ఎఫ్‌సీఐ మూతపడడంతో 5 వేల మంది ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. దానిని తెరిపించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో మాట్లాడి 10 వేల కోట్ల రుణ మాఫీ చేయించి తిరిగి నెలకొల్పేలా చేశామన్నారు. ఇసుక, మినరల్ మాఫియాను అరికడుతున్నామని, తక్కువ ధరకు ప్రజలకు ఇసుక లభించేలా, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా రైతు భరోసా, సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర పథకాలను అమలు చేసిందన్నారు. పార్లమెంట్‌లో గళం ఎత్తి సింగరేణి కార్మికుల కోసం 140 కోట్ల పింఛన్, పెద్దపల్లి, మంచిర్యాలలో పలు రైళ్ల హాల్టింగ్ కోసం వంశీకృష్ణ కృషి చేశారని అన్నారు. మమ్మల్ని ప్రోత్సహిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, సయ్యద్ సజ్జద్, పునుకొండ శ్రీధర్, భూషణవేణ రమేష్‌గౌడ్, బండారి సునీల్, ఎల్ రాజయ్య, మాల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్



ఉత్పత్తి దశలోకి ఆర్ఎఫ్‌సీఎల్

5వ తేది నుంచి యూరియా ఉత్పత్తి

షట్‌డౌన్‌తో 60వేల టన్నుల ఉత్పత్తికి అంతరాయం

7

పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఓసీపీ సందర్శన



మేడిపల్లి ఓసీపీని పరిశీలిస్తున్న టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియాలో మూతపడిన మేడిపల్లి ఉపరితల గనిని శనివారం తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్‌రెడ్డి సందర్శించారు. మేడిపల్లి ఉపరితల గని వద్ద నిర్మించనున్న పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్‌జీ-1 ఏరియా జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి మేడిపల్లి ఉపరితల గని వ్యూ పాయింట్ ద్వారా సందర్శించారు.ప్రాజెక్టుకు సం బంధించిన మ్యాపులను పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను జీఎంను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ తరలింపు, ఖర్చు, గ్రిడ్ కనెక్టివిటీకి సంబంధించి అధికారులతో చర్చించారు. ఎస్ఓటూ జీఎం ఆంజనేయ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ ఇన్‌చార్జి జితేందర్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, వీరారెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్, మేనేజర్ మల్లిఖార్జున్ యాదవ్, టీజీఎన్ పీడీసీఎల్ ఎస్ఈ (ఆపరేషన్) వీ గంగాధర్, ఏడీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిర్చి వేసి.. ముచ్చటించి...



గోదావరిఖని, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శనివారం సాయంత్రం గోదావరిఖని చౌరస్తాలో చిరు వ్యాపారులతో ముచ్చటించారు. వారంలో ఒక రోజైనా చిరు వ్యాపారులను కలుస్తున్నారు. శనివారం సాయంత్రం మెయిన్ చౌరస్తాలోని సర్వర్ హోటల్ వద్ద కార్యకర్తలతో కలిసి టీ తాగేందుకు వచ్చాడు. అక్కడ మిర్చీలు వేస్తున్న యాకూబ్ చేతిలో జాలి తీసుకుని మిర్చీలు వేసి కార్యకర్తలకు అందించాడు.

ఇసుక క్వారీ వద్ద లారీ డ్రైవర్ల ఆందోళన

- కంపనీ లారీల పేరుతో ఇసుక దందా చేస్తున్నారని ఆరోపణ
- ఒక్కోలారీకి రూ.3000 ఇస్తేనే లోడింగ్
- వారం రోజులుగా లారీల్లో ఉంటున్నామని ఆవేదన



ఖమ్మంపల్లిలో రహదారిపై ఉన్న ఇసుక లారీలు

ముత్తారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీరియల్‌లో ఉన్న లారీలను కాదని ముత్తారం నుంచి వస్తున్న కంపెనీ లారీల పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఖమ్మంపల్లి గ్రామంలో ఇసుక క్వారీ వద్ద లారీ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. వారం రోజులుగా లారీలలో జీవిస్తున్నామని, ఇసుక కోసం ప్రభుత్వానికి డీడీ తీసి సీరియల్‌గా లారీలు పెట్టుకొని ఇక్కడే ఉన్నామన్నారు. ఇసుక క్వారీ యజమాని తమ లారీలను కంపనీ లారీల పేరుతో అక్రమంగా తమకు ఇసుక పోయకుండా పంపిస్తున్నాడని ఆరోపించారు. ఒక్కో లారీకి ఇసుక క్వారీ వారు 3వేల నుంచి 4వేలు ఇస్తేనే ఇసుక లోడ్ చేస్తున్నారని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. 100 లారీలు లోడ్ చేస్తే దాదాపు ఒకరోజు 3లక్షల అక్రమంగా వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీ ప్రకారం రూపాయి కూడా ఇవ్వవద్దని చెప్తుంటే, ఇక్కడ క్వారీ యాజమాన్యం మాత్రం డబ్బులు ఇస్తేనే లోడ్ చేస్తున్నారని ఆరోపించారు. కంపనీ పేరుతో క్వారీ యాజమాన్యం ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే టీఎస్ఎండీసీ, మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైన వందల కొద్ది లారీలు పెట్టుకొని తాము ఇబ్బందులు పడుతున్నామని, అలాగే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, కలెక్టర్ స్పందించి వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

తల్లి పాలు పిల్లలకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పిల్లల వైద్యులు, గైనకాలజిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టిన పిల్లలకు ముర్రిపాలు తాగించాలని, కొందరు తల్లులు పిల్లలకు పాలు ఇవ్వకపోవడం వల్ల వారి ఎదుగుదలతోపాటు అనారోగ్యానికి గురవుతున్నారని, తల్లి పాలు ఎంత ఇస్తే పిల్లలు అంత ఆరోగ్యంగా ఉంటారన్నారు. సూపరింటెండెంట్ హిమబిందు, వైద్యులు రాజు, శిరీష, తల్లులు పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పుట్టిన పిల్లలకు ముర్రిపాలు తాగించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. సూపర్‌వైజర్లు షరీన, జమున, మమత పాల్గొన్నారు.

స్నేహితులతోనే కలకాలం

● నేడు ఫ్రెండ్‌షిప్ డే..

7

ఖనిలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

కోల్‌సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో శనివారం మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అదనపు సెషన్ జడ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు నడిపెల్లి కిషన్‌రావు, కాదాసి శేఖర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ మద్యం దుకాణం సమీపంలో మండల కేంద్రానికే చెందిన హమాలీ కార్మికుడు ఒగ్గు మల్లయ్య(60) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. మల్లయ్య స్థానికంగా హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల1న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. శనివారం మధ్యాహ్నం గ్రామంలోని ఓవ్యక్తికి మద్యం దుకాణం సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మల్లయ్య కిందపడి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. దీంతో అతడు కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకుని చూసేసరికి మల్లయ్య చనిపోయి ఉన్నాడు. మృతుడు మల్లయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి గ్రామానికి చెందిన మోతుకు రాజు అనేవ్యక్తి ఇంటి సమీపంలోని ప్రహరీ పక్కననాలుగు గంజాయిమొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మోతుకురాజు తన ఇంటిలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడనే సమాచారం మేరకు పోలీసులు అతని ఇంటికెళ్లి తనిఖీచేసి నాలుగు మొక్కలను గుర్తించారు. గంజాయి మొక్కలను సీజ్‌చేసి మోతుకు రాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల రహదారిపై కొత్తపల్లి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపునకు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరికి గాయపడ్డారని, ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు అందలేదని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

పారాక్వాట్.. ప్రాణాంతకం

- గడ్డి మందులతో రైతుల ఆరోగ్యంపై ప్రభావం
- విషపూరితమైన మందుతో పార్కిన్సన్ వ్యాధి



చొప్పదండి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పారాక్వాట్ డైక్లోరేడ్(పెస్టిసైడ్) అనేది ఒక క్రిమిసంహారక మందు. దీనిని వ్యవసాయంలో కలుపు మొక్కలను నాశనం చేయడానికి రైతులు ఉపయోగిస్తున్నారు. పంట పొలాల్లో గడ్డిని తొలగించడానికి ఇది ఉపయోగపడుతుందని రైతులు ఈ మందును విస్తృతంగా పిచాకిరి చేస్తున్నారు. పారాక్వాట్ మందు ప్రాణాంతకంగా మారుతుందని, ఈ మందు పిచికారి చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు. అత్యంత విషపూరితమైన ఈ మందుతో రైతులు పార్కిన్సన్ వ్యాధిన బారిన పడే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతు న్నారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుతున్న ఈ మందును 50 దేశాల్లో నిషేధించారు. పారాక్వాట్ మందు పంట పొలాలకు కలుపు నివారణకు ఉపయోగించే అత్యంత ప్రమాదకరమైనది, విషపూరితమైనదిగా మందు డబ్బాలపైనే కంపెనీలు తెలియజేస్తున్నాయి. మందు ను పిచికారి చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ఆరోగ్యంపై ప్రభావం చూపే ఆస్కారం ఉంది. ఈ మందు నాడి వ్యవస్థను దెబ్బతీస్తుంది. తరచూ ఈ మందులను పిచికారి చేసే రైతులకు దీర్ఘకాలిక వ్యాధులైన పార్కిన్సన్స్(చేతులు వణుకుతాయి) వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. విదేశాల్లో ఈ మందును వాడిన అనేక మంది రైతులు పార్కిన్సన్స్ బారిన పడినట్లు సమాచారం. యూరప్ సహా అనేక దేశాల్లో ఈ మందులను నిషేధించారు. ఈ మందుల ప్రభావం ఊపిరితిత్తులు, చర్మం, కళ్లపై కూడా పడే అవకాశం ఉంది. రైతులు, రైతు కూలీలతోపాటు పర్యావరణం, జీవ వైవిధ్యంపై కూడా ప్రభావం పడుతుందని అధికారులు చెబు తున్నారు.

● సూచనలు, జాగ్రత్తలు...

రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పారాక్వాట్ మందును వాడిన సందర్భంలో పలు జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలి. పారాక్వాట్ మందు డబ్బాపై ఉన్న సూచనలు పాటించాలి. నిర్దేశించిన మోతాదులో మాత్రమే మందును వాడాలి. ఇతర మందులతో ఈ మందును కలుపవద్దు. మందు తయారీదారు చేసిన సూచనల ప్రకారమే మందును పిచికారి చేయాలి.

రైతులు రక్షణ చర్యలు చేపట్టాలి...

- వంశీకృష్ణ, వ్యవసాయాధికారి, చొప్పదండి



పారాక్వాట్ మందును పిచికారి చేసే సమయంలో రైతులు పలు రక్షణ చర్యలు చేపట్టాలి. చేతులకు, గ్లౌజులు, ముఖానికి మాస్కును తప్పనిసరిగా ధరించాలి. శరీరానికి తగలకుండా జాగ్రత్తపడాలి. మందు పొగను పీల్చడం ప్రమాదకరం కాగా రైతులు గాలి వచ్చే దిశలో పిచికారి చేయాలి. మందును మోతాదుకు మించి పిచికారి చేస్తే విష ప్రభావం అధికంగా ఉంటుంది. శ్వాస కోస వ్యవస్థకు హాని జరగకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

రైల్వే గేట్ల మధ్య చిక్కుకున్న కారు

- గేట్‌మన్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం



రైల్వే గేటు లోపల చిక్కుకున్న కారు

కొడిమ్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై కొడిమ్యాల మండలం నమిళికొండ గ్రామ శివారులో శనివారం రైల్వేగేట్ల మధ్య కారు చిక్కుకుంది. రైలు వస్తుందన్న సమాచారంతో గేట్‌మన్ రైల్వే గేట్ వేసి రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అదే సమయంలో కరీంనగర్ నుంచి జగిత్యాల వైపువెళ్తున్న కారుగేటు లోపలికి చేరుకుంది. రెండు వైపులా గేట్లు మూసుకున్నాయి. ప్రమాదాన్ని పసిగట్టి అప్రమత్తమైన గేట్‌మన్ సిగ్నల్‌తో కొంతసేపు రైలును నిలిపివేసినట్లు నమిళికొండ గ్రామస్థులు తెలిపారు. అనంతరం రైల్వేగేట్లను తెరవడంతో కారు బయటకు వెళ్లిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది.

మొబైల్ ఫోన్ దొంగిలించి డబ్బులు డ్రా చేసిన వ్యక్తి అరెస్ట్



దొంగను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ దొంగిలించి ఫోన్ పే ద్వారా డబ్బులు డ్రా చేస్తూ మోసాలకు పాల్పడుతున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం అలీపూర్‌జిల్లా పున్సపర గ్రామానికి చెందిన బర్మన్ హరి(32)ని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బర్మన్ అనేవ్యక్తి ఇంటర్ వరకు చదువుకుని దురలవాట్లకు అలవాటుపడి మొబైల్స్ దొంగిలించి అందులో ఉన్న ఆధార్ కార్డు, పాన్‌కార్డుల సహాయంతో ఫోన్ పే, గుగూల్‌పే పాస్వర్డ్ రీసెట్ చేసి డబ్బులు వేరే అకౌంట్‌కి పంపించుకుంటాడు. ఈ డబ్బుతో జల్సా చేసేవాడు. ఇందులో భాగంగా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన సిరికొండ శ్రీనివాస్ అనేవ్యక్తి 12 మార్చి 2025న రైలులో తిరుపతి వెళ్తున్న క్రమంలో అతనిభార్య ఫోన్‌ను దొంగిలించాడు. ఆ ఫోన్‌లో ఉన్న ఫోన్‌పే ద్వారా పలు దఫాలుగా తన అకౌంట్లో నుంచి రూ.5.12లక్షలు మరో అకౌంట్‌కు బదిలీ చేశాడు. బ్యాంకు స్టేట్‌మెంట్ ద్వారా శ్రీనివాస్ రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశాడు. ఈ కేసు విచారణలో భాగంగా చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు, జిల్లా సైబర్ క్రైమ్ ఆర్‌ఎస్‌ఐ జునైద్, కానిస్టేబుళ్లు కిట్టు, మహేశ్, గంగిరెడ్డి, రాజు అధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితుడు బర్మన్ హరిని విజయవాడలో అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

గంజాయి అమ్మడానికి వచ్చిన యువకుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సిరిసిల్ల రూరల్ సీఐ

ఇల్లంతకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంజాయిని అమ్మడానికి వచ్చిన మాతంగి మనీష్ అనే యువకుడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలప్రకారం.. చింతలకుంట గ్రామానికి చెందిన మనీష్ కరీంనగర్‌లోని ఓ వాటర్‌ప్లాంటులో పని చేస్తూ మత్తుకు, జల్సాలకు అలవాటుపడ్డాడు. త్వరగాడబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కరీంనగర్‌లోని ఓ వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలుచేసి ఇల్లంతకుంటలో అమ్మడానికి శనివారం వస్తున్నాడనే సమాచారం మేరకు బతుకమ్మతెప్ప వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. తనిఖీలలో మనీష్ పట్టుబడగా, అతని వద్ద 110గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టుచేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై శ్రీనివాస్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జ్యోతినగర్‌లో నివాస ముండే బండారి రాకేష్(30) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో రాకేష్ మెకానిక్‌గా పని చేసే వాడు. కొంతకాలంగా అనారోగ్య కారణాలు, మానసికస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ రమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మానకొండూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన కెక్కర్ల సురేష్(27) అనే యువకుడు కరీంనగర్‌లోని ఓ షోరూంలో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం మద్దికుంట నుంచి కరీంనగర్‌కు తన మోటార్ సైకిల్‌పై కరీంనగర్‌కు వెళ్లి రాత్రి పని ముగించుకొని మద్దికుంటకు బయలుదేరాడు. మండలంలోని పోచంపల్లి వద్ద రోడ్డుపై టిప్పర్ ఆగి ఉంది. రాత్రి టిప్పర్ కనిపించకపోడంతో వెనకాల నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా గ్రామస్థులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, రెండేళ్ల కూతురు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదానికి గల కారణాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- 2.1 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితులను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘు చందర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముఠాను శనివారం జగిత్యాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురి నుంచి 2.150 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ శనివారం వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల, జగిత్యాల పట్టణ ఎస్సైలు సందీప్, రవి కిరణ్‌లు తమ సిబ్బందితో పూడూర్‌తో పాటు మిషన్ కాంపౌండ్ ప్రాంతాల్లో సోదాలు చేశారన్నారు. పూడూర్‌లో ఇద్దరు, మిషన్ కంపౌండ్‌లో ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన గుండు ప్రశాంత్, మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన బాలె నవీన్, గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందిన వంశీ అనే ముగ్గురితో పాటు జగిత్యాల పట్టణంలోని లింగంపేటకు చెందిన ఆవునూరి రణధీర్, తులసీ నగర్ ప్రాంతానికి చెందిన ఆకుల అమర్నాథ్, రాయరపు మల్లికార్జున్ అనే ఆరుగురు యువకులు వేర్వేరుగా రెండు ముఠాలుగా ఏర్పడ్డారని తెలిపారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని జగిత్యాల జిల్లాకు తీసుకవచ్చి విక్రయిస్తున్నారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని డోర్నకల్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రాంతం నుంచి బైక్, ట్రైన్‌లో వెళ్లి 3కిలోలగంజాయిని కొనుగోలు చేసి జగిత్యాలజిల్లాకు తీసుకువచ్చినట్లు డీఎస్పీ వివరించారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూర్, పట్టణం లోని మిషన్ కంపౌండ్‌లో ఆరుగురు ముఠా సభ్యుల్లో వంశీ అనే యువకుడు పరారీలో ఉండగా మిగతా ఐదుగురు యువకులు గంజాయి సేవించే వ్యక్తులకు విక్రయించేందుకు రాగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో జగిత్యాల టౌన్, మల్యాల సీఐలు కరుణాకర్, రవి, ఎస్సైలు రవి కిరణ్, సందీప్, హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, సిబ్బంది మహేష్ కుమార్, అరుణ్, కిరణ్, రాకేష్ తదితరులు ఉన్నారు.

రైతులకు సాగునీరివ్వండి

- లేని పక్షంలో మంత్రుల పర్యటనను అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చేతులెత్తి మొక్కుతున్న రైతులకు సాగునీరివ్వాలని చొప్పదండి మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏ ముఖం పెట్టుకుని కరీంనగర్‌కు నీటిపారు దల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వస్తున్నారని ప్రశ్నించారు. కన్నెపల్లి పంపుహౌజ్ ద్వారా నీళ్ల ఎత్తిపోసి కరీంనగర్‌లో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంత్రుల పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కాలువలు, చెరువుల్లో నీళ్ల లేక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఆనాటి రోజులు అంటే నాటికాంగ్రెస్ పాలనకరువు రోజులు గుర్తు చేస్తున్నారని ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నీళ్ల ఎత్తిపోసి నీరందించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో ఒకఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి తరువాత వన్‌టౌన్ పోలీసులు దాడిచేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.12400నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో అశోక్‌నగర్, గాంధీనగర్, హనుమాన్ నగర్, రామగిరి మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన వారు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం



అయిలాపూర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్‌లో కాంగ్రెస్,బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య శనివారం వాగ్వాదం జరిగింది. యూరియా పంపిణీపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అసత్య ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు చర్చించేందుకు ఎమ్మెల్యే అయిలాపూర్‌లోని రైతు వేదికలో బహిరంగ చర్చకు రావాలని రెండురోజుల క్రితం కాంగ్రెస్ నాయకులు సవాల్‌విసిరారు. దీంతోశనివారం నియోజక వర్గంలోని బీఆర్‌ఎస్‌శ్రేణులు అయిలాపూర్ గ్రామానికి భారీ సంఖ్యలో చేరుకున్నారు. అప్పటికే రైతు వేదికలో కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తన అనుచరులతో బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. దీంతో పోలీసులు గ్రామంలో భారీబందోబస్తు నిర్వహించి ఎక్కడివారిని అక్కడే అడ్డుకున్నారు. రైతు వేదికలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారన్న విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌నాయకులు రైతువేదిక వైపు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌నాయకులు రైతువేదిక నుంచి బయటకువచ్చి నినాదాలు చేస్తూ బీఆర్‌ఎస్‌నాయకుల వైపు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరుపార్టీల నాయకులు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పోటాపోటీగానినాదాలు చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతోపోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని కోరుట్ల సర్కిల్ పరిధిలోని పలు పోలీసు స్టేషన్‌లకు తరలించారు. అక్కడేఉన్న కాంగ్రెస్ నాయకులను సముదాయించి పంపించి వేశారు. బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ ఆ పార్టీనాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అయిలాపూర్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు చోటు చేసుకోకుండా కోరుట్ల, మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, అనిల్‌కుమార్, ఎస్‌ఐలు భారీ బందోబస్తు నిర్వహించారు.

పెన్షన్ల కోసం భవనం ఎక్కాల్సిందే

- సిగ్నల్స్ లేక లబ్ధిదారుల ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్లకోసం లబ్ధిదారులు భవనాలు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్స్ లేక పంపిణీలో వృద్ధులు, దివ్యాంగ, వితంతు తదితర పెన్షన్‌దారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. శనివారం మెట్‌పల్లి మండలంలోని రంగరావుపేట గ్రామంలో పెన్షన్ కోసం గంటల కొద్దీ భవనాలపై పడిగాపులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం పింఛన్ పంపిణీలో చేయూత యాప్‌లో ముఖ గుర్తింపు తప్పనిసరి చేసింది. దీంతో పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. నూతన విధానం ప్రకారం పోస్టాఫీసు సిబ్బంది మొబైల్‌లోనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లబ్ధిదారుల ఫొటోలను అప్‌లోడ్ చేసి పెన్షన్ చెల్లించాలి. సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో నాలుగురోజుల నుంచి లబ్ధిదారులు భవనాలపై నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.



రంగరావుపేటలో సిగ్నల్ కోసం భవనం ఎక్కి దిగుతున్న వృద్ధులు, మహిళలు

కరీంనగర్‌లో పోలీసుల నాకా బందీ



నాకా బందీని పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీసులు నగరవ్యాప్తంగా శనివారం రాత్రి ఏకకాలంలో నాఖాబందీ నిర్వహించారు. నగరంలోని కమాన్, ఒకటోతాణా ఎదుట, బస్టాండ్ చౌరస్తా, ఇందిరాచౌక్, రాంనగర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్, రాజీవ్‌చౌక్, కోర్టుచౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, నాకాచౌరస్తా, పద్మనగర్, ఎన్టీఆర్ చౌక్ తదితర 20 ప్రధానకూడళ్ల వద్ద చేపట్టిన నాకాబందీలో సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాలల్గొని వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలు, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవ్, సరైన ధ్రువపత్రాలు(డాక్యుమెంట్లు) లేని 50పైగా వాహనాలను గుర్తించి సీజ్‌చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు, భవిష్యత్‌లోనూ కొనసాగించనున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

భగత్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం నగరంలోని సీపీఐజిల్లా కార్యాలయం బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రకార్యవర్గసభ్యులు మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)కి వందేళ్ల చరిత్ర ఉందని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పార్టీని నిలువరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19నుంచి 22వరకు మేడ్చల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్‌లో జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. పార్టీశ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, బ్రామండ్లపెల్లి యుగేందర్, మావురపు రాజు, బోనగిరి మహేందర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పించండి

● జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి 20నెలలు కావస్తున్నా ముఖ్యమంత్రి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు గ్రామాల్లో అభివృద్ధి పనులను గాలికి వదిలేశారని ఆరోపించారు. జనహిత పాదయాత్రలు చేస్తున్న మీనాక్షి నటరాజన్ 2019-24వరకు తెలంగాణ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులను చూసి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి పెండింగ్ బిల్లులను ఇప్పించాలన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి హామీనిచ్చాడని అన్నారు. గతంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని జేఏసీ ఆధ్వర్యంలో ధర్నాలు, పాదయాత్రలు, రాస్తారోకోలు చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వం జేఏసీ నాయకులు, మాజీ సర్పంచ్‌లపై అక్రమ కేసులు పెట్టిందని ఉద్యమాన్ని అణచివేసిందని ఆరోపించారు. మంత్రి సీతక్క పెండింగ్ బిల్లులు రూ. 700 కోట్లు ఉన్నాయని విడతల వారిగా చెల్లిస్తామని హామీనిచ్చి ఇప్పటివరకు చెల్లించకపోవడం విచారకరమన్నారు. గ్రామాల్లో అప్పటి సర్పంచ్‌లు ప్రజల అభివృద్ధి కోసం తప్ప ఎవరి స్వంతంకోసం పనులు చేయలేదని ముఖ్యమంత్రి గ్రహించాలన్నారు. ఇప్పటికైనా మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లును చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో జనహిత పాదయాత్రలో ఉన్న మీనాక్షి నటరాజన్‌ను కలిసి సమస్యలను చెప్పుకోవడం కోసం తమకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నాల లక్ష్మణ్, ఆరె మహేందర్, జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, రవినాయక్, రాసూరి రాజేష్, చిట్నేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులతోనే కలకాలం..



● మార్కెట్లోకి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్.. బహుమతులు

● నేడు ఫ్రెండ్‌షిప్ డే..

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహానికి మించిన బంధం ఈ లోకాన లేదు. రక్త సంబంధీకులతో ముడిపడిన బంధాలకంటే ఎలాంటి బంధుత్వం లేకపోయినా జీవితాంతం తోడునీడగా ఆప్యాయత, అనురాగాలు పంచే బంధం స్నేహం. ప్రతి ఒక్కరికి ఎవరో ఒకరు ఆప్తమిత్రులుగా ఉంటారు.

● అండగా నిలుస్తున్న స్నేహాలు..

ఫేస్‌బుక్, ఎక్స్ ఇన్స్టాగ్రామ్, వాట్సప్‌లో లైక్‌లు కొట్టడం, కామెంట్లు చేయడమే కాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా కొంతమంది స్నేహితులు ఒక బృందంగా ఏర్పడి ఎంతో మందికి సహాయాన్ని అందిస్తూ ప్రశంసలను అందుకుంటున్నారు. ఒకరికి ఒకరు అండగా నిలుస్తున్నారు. చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు చేస్తున్నవారు చదువుకుంటున్న విద్యార్థులు సైతం ఫౌండేషన్‌లుగా ఏర్పడి తోటి మిత్రులను ఆదుకుంటున్నారు. చిన్ననాటి మిత్రులందరు కలిసి తాము అక్షరాలు దిద్దుకున్న గ్రామాల్లోని పాఠశాలలను బాగు చేస్తున్నారు. స్నేహమంటే ఇది అంటూ యువత కొత్త నిర్వచనాన్ని అందిస్తున్నారు.

● ఫ్రెండ్‌షిప్‌డే నేపథ్యం ఇది..

గ్రీటింగ్ కార్డ్స్ తయారు చేసే హాల్ మార్క్ అనే సంస్థ వ్యవస్థాపకుడు జోయ్స్ సీ హాల్ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించాలని 1919లో అనుకున్నాడు. ప్రజల్లో స్నేహభావాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో 1935లో అమెరికా కాంగ్రెస్ ఫ్రెండ్‌షిప్ డేను నిర్వహించాలని తీర్మానించింది. అమెరికా దేశస్థులు 1935 ఆగస్టు 6న జాతీయ స్నేహ దినోత్సవాన్ని జరుపుకున్నారు. జూలై 30ని ప్రపంచ స్నేహ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. మనదేశంలో మాత్రం ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



● మార్కెట్‌లో ఫ్రెండ్‌షిప్ డే సందడి



ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా మార్కెట్‌లో సందడి కనిపించింది. పలు ప్రాంతాల్లో వెలసిన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ల అమ్మకాల షాపులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఆకట్టుకునే అందమైన బ్యాండ్‌లు షాపుల నిర్వాహకులు అమ్మకాలకు ఉంచారు. విద్యార్థులు, యువత ఆసక్తితో తిలకిస్తూ వాటిని కొనుగోలు చేశారు. విభిన్న రూపాల్లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కనువిందు చేశాయి. దేశ విదేశాల్లో ఉన్న మిత్రులకు ఫోన్ ద్వారా ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. యువత స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అమ్మకాలు కొనసాగాయి.

ఉత్పత్తి దశలోకి ఆర్ఎఫ్‌సీఎల్

● 5వ తేదీ నుంచి యూరియా ఉత్పత్తి

● షట్‌డౌన్‌తో 60వేల టన్నుల ఉత్పత్తికి అంతరాయం



కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)లో శనివారం లైట్ అప్(ఉత్పత్తి దశ ప్రక్రియ) చేశారు. అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో జూలై 15వ తేది నుంచి ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపివేశారు. 25వ తేదీలోగా మరమ్మతు పూర్తి చేస్తారని అంచనా వేసినా సాధ్య పడలేదు. ఆర్ఎఫ్‌సీఎల్ మరమ్మతుల ప్రక్రియ ప్రారంభం కావడానికే నాలుగైదు రోజుల సమయం పట్టింది. ఢిల్లీ నుంచి సీఈవో అలోక్ సింఘాల్ ప్లాంట్‌కు రావడంతో మరమ్మతులు వేగవంతమయ్యాయి. రెండు వారాలపాటు ఆయన ఆర్ఎఫ్‌సీఎల్‌లోనే మకాం వేశారు. పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సమయంలో మరో డ్యామేజీని గుర్తించారు. దీంతో మరమ్మతుల్లో మరింత జాప్యం ఏర్పడింది. ప్లాంట్ షట్‌డౌన్ అయిన 18రోజుల తరువాత మరమ్మతుల ప్రక్రియ పూర్తయి శనివారం లైట్ అప్ చేశారు. ఈ నెల 5వ తేదీ నాటికి యూరియా ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రోజుకు 3850టన్నుల యూరియా ఉత్పత్తి సామర్థ్యం గల ఆర్ఎఫ్‌సీఎల్‌లో 18రోజులపాటు యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు 60వేల టన్నుల ఉత్పత్తి నష్టం జరిగింది. రూ.60 కోట్ల వరకు పరిశ్రమకు ఆర్థిక నష్టం జరిగింది. జూలై నెలలో తెలంగాణకు 30వేల టన్నుల యూరియా సరఫరా జరుగాల్సి ఉండగా ప్లాంట్ షట్‌డౌన్‌తో కేవలం 16వేల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు యూరియా సరఫరా నిలిచిపోయింది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తిమ్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. అండర్-20 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో బి. అక్షిత, 200 మీటర్ల పరుగు పందెంలో టి. పూజ, 400 మీటర్ల పరుగు పందెంలో ఎం. సాత్వికాంజలి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలను ప్రిన్సిపాల్ శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ హరిరామ్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ముత్తయ్యరెడ్డి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థినిలు అభినందించారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

● ధర్మపురి, కొండగట్టు క్షేత్రాల్లో భక్తుల పూజలు



ధర్మపురిలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తులరద్దీ పెరిగింది. శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఉగ్రనరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వరస్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్తహారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని జగిత్యాల జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి నారాయణ శనివారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: శ్రావణ శనివారం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్న సన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరాత్ర పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేడు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

తిమ్మాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎండీ), మాస్టర్‌ఆఫ్‌సర్జరీ(ఎంఎస్), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పీజీ-2025 ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. ఈ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ), పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షకోసం నేషన్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్ పీజీ) ఇప్పటికే పూర్తి చేసింది. ఈ పరీక్ష ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనుంది. ఈ ప్రవేశపరీక్ష ద్వారా పోస్ట్ ఎంబీ బీఎస్ డిప్లొమాట్ ఆఫ్ నేషనల్ బోర్డ్(డీఎన్‌బీ), డాక్టరేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ వంటి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందనున్నారు, ఈ పరీక్ష కోసం తిమ్మాపూర్ మండలంలో ఆయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. అభ్యర్థులను పరీక్ష సమయానికి 45నిమిషాల ముందు మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు.

అవయవదానం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవయవ, నేత్రదానం సామాజిక బాధ్యత అని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ అన్నారు. శనివారం నగర పాలకసంస్థ కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలకు నేత్ర, అవయవ, రక్తదానాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ సమన్వయంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు, ప్రతిఒక్కరూ అవయవ, నేత్రదానానికి ముందుకు రావాలని, ఒకటినుంచి 7వరకుజరిగే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో అన్నప్రసన్న మాట్లాడుతూ మరణాంతరంతోపాటు జీవించి ఉండగా కొన్ని అవయవాలు దానం చేయవచ్చునని, కాలెయం, క్లోమం, వెంట్రుకలు, చర్మందానం చేయవచ్చునని, రక్తదానంపై అపోహలు వీడాలని, ఏడాదిలో కనీసం 4నుంచి 5సార్లు రక్తదానం చేవచ్చునన్నారు. ఆర్ఎంవో రాజు, సదాశయ ఫౌండేషన్ ప్రచారకార్యదర్శి వాసు, లింగమూర్తి, సాన రామకృష్ణారెడ్డి, మెప్మా సీవో శమంత కమణి, టీఎంసీ మౌనిక పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

సుభాష్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌వెంకటరమణ బృంద సభ్యులతో కలిసితనిఖీచేశారు. ప్రైవేట్ హాస్పిటల్ పనితీరు, వారు నిర్వహించే రిజిస్టర్లు, పేషెంట్ అనుమతిపత్రాలు, కేస్‌రికార్డ్స్, సంబంధిత డాక్యుమెంట్స్‌ను పరిశీలించారు. నిపుణులైన గైనకాలజిస్టు, ఇతరక్వాలిఫైడ్ స్పెషలిస్టుల ఒరిజినల్ సర్టిఫికెట్స్, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను పరిశీలించారు. ప్రైవేట్‌హాస్పిటల్స్‌లో ప్రసవాలు జరిగిన గంటలోపు తల్లిపాలు శిశువులకు అందించడంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం హౌసింగ్ బోర్డులోని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సీపీఎం హెచ్ఎస్ డాక్టర్ సనజ వేరియా, సీడీపీవో సబిత, పట్టణఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఆకాశం వైపు అన్నదాత చూపు

● మెట్ట ప్రాంతాల్లో ముందుకు సాగని వ్యవసాయం ● ఎండలకు వాలిపోతున్న పత్తి.. బీడుగా పొలాలు



కాట్రపల్లిలో నీళ్లు లేక బీడుగా ఉన్న పొలాలు

హుజూరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. పదిరోజులుగా విపరీతంగా ఎండలు కొడుతుండడంతో పత్తిపంటలు వాలిపోతున్నాయి. రైతులు పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. వ్యవసాయం ముందుకు సాగకుండా పొలాలన్నీ బీడుగా మారాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్నుకొని పత్తి రైతులు గింజలు విత్తారు. అప్పుడప్పుడు కురిసిన ముసురులకు పత్తి ఓ మాదిరిగా ఉండగా, పదిరోజులుగా కొడుతున్న ఎండలకు వాలిపోతున్నాయి. గత సంవత్సరం ముందుగా పత్తి సాగుచేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఈ సంవత్సరం కేంద్రప్రభుత్వం పత్తికి మద్దతుధర క్వింటాల్‌కు రూ.589పెంచడంతో పత్తిసాగుకు రైతులు మొగ్గు చూపారు. గత సంవత్సరం పత్తిక్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధరఉండగా, ఈ ఏడాది పొడవైన పత్తికి రూ.8110, సాధారణ పత్తికి క్వింటాల్ రూ.7710 మద్దతుధర ప్రకటించింది. అలాగే మెట్టప్రాంతంలోని రైతులు వర్షాలు కురుస్తాయనే ఉద్దేశ్యంతో వరినార్లు పోశారు. అవికాస్త ముదిరిపోయే దశకు చేరుకుంది. ఈ సంవత్సరం పెద్దగా వర్షాలు కురిసిన దాఖలాల్లేవు. బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరగకపోవడంతో రైతులు పొలాలు దున్నక బీడులుగానే ఉంచారు. మెట్టప్రాంతాల్లో వర్షం పడితేనే వ్యవసాయపనులు ముందుకు సాగనున్నాయి. మరోవారం రోజుల్లో వరినాట్లు వేయకుంటే పోసిన వరినారు ఎందుకూ పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు చెరువు, కుంటల్లోకి నీళ్లు వచ్చిన సందర్భాలు లేవు. డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉండగా, 1.20లక్షల ఎకరాల్లో సాగుభూమి ఉంది. అందులో సుమారు 20వేలఎకరాల్లో పత్తి, 80 ఎకరాల్లో వరి, 20వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు పడితేనే పంటలు పండే అవకాశంఉంది. లేనియెడల రైతులు అప్పుల్లో కురుకుపోయే పరిస్థితి నెలకొంది.



ఇప్పల్‌నర్సింగాపూర్‌లో వడలిపోతున్న పత్తి

● నీటి కోసం ఎదురుచూపులు..

హుజూరాబాద్ ఎస్సారెస్పీ ఆయకట్టు కింద నీళ్లు వస్తాయనే ఉద్దేశ్యంతో రైతులు కొద్దిపాటి కురిసిన వర్షాలకు, బావుల్లోఉన్న నీటితో కొంత మేర పొలాలు దున్ని నాట్లువేశారు. మిగితా రైతులు నీళ్లలేక పొలాలన్నీఅలాగే వదిలేశారు. ఇప్పటివరకు ఆయకట్టుకింద 50శాతం మాత్రమే వరినాట్లు వేశారు. ఆయకట్టు కిందనాట్లు వేసిన రైతులు నీళ్లలేక పొలాలు పారకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎల్ఎండీ నీళ్లకోసం ఎదురుచూస్తున్నారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

● ప్రాజెక్టులోకి 4,352 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం స్వల్పంగా వరద నీరు వచ్చింది. డ్యామ్‌లోకి 4,352 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 39.188 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 29.690 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.485 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

నాందేడ్ టు తిరుపతి ప్రత్యేక రైలు సమయంలో మార్పు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల పాటు నాందేడ్ టు తిరుపతి, తిరుపతి టు నాందేడ్ నడిచే ప్రత్యేకరైలు రాకపోకల సమయంలో మార్పులుచేస్తూ దక్షిణమధ్య రైల్వే అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతనెల26 నుంచి నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా తిరుపతికి ప్రత్యేక రైలును నడిపిస్తున్నట్లు, ఈనెల 2నుంచి జగిత్యాల, కరీంనగర్ రైల్వేస్టేషన్లకు వచ్చే సమయంలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. నాందేడ్‌లో ప్రతీ శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయల్దేరి ముదుఖేడ్, బాసర, నిజామాబాద్ మీదుగా జగిత్యాలకు రాత్రి 8:30 గంటలకు, కరీంనగర్‌కు రాత్రి 9 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటిరోజు ఆదివారం ఉదయం 11:30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని, అదేరోజు సాయంత్రం 4గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి మరుసటి రోజు సోమవారం ఉదయం 9.08గంటలకు కరీంనగర్ చేరుకొని నాందేడ్ బయల్దేరు తుందని పేర్కొన్నారు. ఈ నెలలో ప్రతీ శనివారం 2, 9, 16, 23, 30తేదీల్లో నాందేడ్ నుంచి తిరుపతికి, ప్రతీ ఆదివారం 3, 10, 17, 24, 31 తేదీల్లో తిరుపతి నుంచి నాందేడ్‌కు రైలు నడుస్తుందని తెలిపారు. రైలు రాకపోకల సమయంలో మార్పుతతో కరీంనగర్, జగిత్యాల రైల్వే స్టేషన్లకు గతంలో కంటే అరగంట ముందుగా చేరుకుంటుందని కరీంనగర్ రైల్వే స్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ భానుచందర్ పేర్కొన్నారు.

విద్యార్థులకు సంగీతంలో శిక్షణ

● పీఎం శ్రీ పథకంలో పాఠశాలలు ఎంపిక

● ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు తమకు అభిరుచి ఉన్న కళారంగంలో రాణించడానికి సంగీతంపై శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిపూర్ణ అభ్యసనకు దోహదపడే అంశాలను వారికి అందుబాటులోకి తెచ్చి పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నాయి.



ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) యోజన ద్వారా రాష్ట్రంలో 832 బడులు ఎంపికయ్యాయి. కరీంనగర్ జిల్లాలో 22 ప్రభుత్వ పాఠశాలు ఎంపిక కాగా సంగీత తరగతులు నిర్వహించడానికి తొలి విడతలో 13, రెండో విడతలో తొమ్మిది పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ మ్యూజిక్ క్లాస్‌లు చెప్పించాలని, రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. వీటిలో కొన్ని పాఠశాలలకు వయోలిన్, తబలా, మృదంగం, హార్మోనియం, మరికొన్ని పాఠశాలలకు బ్యాండ్ సంగీత పరికరాలను అందించనున్నారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలకు లక్ష రూపాయల చొప్పున అందనున్నాయి. ఈ మేరకు ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంగీతాన్ని నేర్పించనున్నారు. వారానికి ఒక క్లాస్ చొప్పున ఆయా పరికరాలతో శిక్ష ఇప్పిస్తారు. త్వరలో సంగీత తరగతుల నిర్వహణపై ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్‌కు శిక్షణ ఇస్తారు.

● సంగీత బోధనకు ఉపాధ్యాయులు

సంగీత పాఠాలు చెప్పేందుకు పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని అధికారులు భావిస్తున్నారు. దానికి సంబంధించిన పూర్తి మార్గ దర్శకాలు వచ్చిన తర్వాత జిల్లా అధికారులు పర్యవేక్షణలో సంగీత పాఠాలు నేర్పిస్తారు.

చిట్టి చేతులతో విత్తన బంతులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులచే శనివారం విత్తన బంతులు తయారు చేయించారు. వీటిని అటవీ అధికారుల సమక్షంలో విద్యార్థుల చేత స్థానిక కొండ ప్రాంతంలోని అటవీ భూమిలో వెదజల్లించారు. విత్తన బంతులను తయారు చేయించిన పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌ను అటవీ అధికారులు అభినందించారు.

కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, బీట్‌అధికారి మధుసూదన్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, నరేష్, అశోక్, స్వామి, రాజేంద్ర ప్రసాద్, భూలక్ష్మి, సుమతి పాల్గొన్నారు.



విత్తన బంతులు వెదజల్లుతున్న విద్యార్థులు

నవోదయ విద్యాలయాన్ని నెలకొల్పాలి

(5వ పేజీ తరువాయి)

కోకరిక్యులమ్ యాక్టివిటీ, కమ్యూనిటీ సర్వీస్, సోషల్ ఈక్విటీ, తదితర అంశాలపై విద్యార్థులకు పట్టు ఉండేలా విద్యాబోధనతోపాటు కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవోదయ విద్యాలయాల్లో చదువుకున్న అనేక మంది ఉన్నత ఉద్యోగాలు సాధించారు. నాణ్యమైన అందించడమే కారణమని పూర్వ విద్యార్థులు చెబుతుంటారు. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన పెద్దపల్లి జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు కాకపోవడంతో సీబీఎస్ఈ విద్యకు నోచుకోవడం లేదు. సీబీఎస్ఈ విద్య చదవాలంటే ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు దృష్టి సారించి వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరయ్యే విధం గా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం : మంత్రి శ్రీధర్‌బాబు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

రామగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కల్వచర్ల గ్రామానికి ఇచ్చిన అంతర్గత ప్రధాన రహదారి సమస్య పరిష్కారానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం అంతర్గత ప్రధానరహదారికి రూ. 2.60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో మహిళలు రోడ్డు సమస్యను ప్రధానంగా చెప్పారని వారి అభిప్రాయం మేరకే రోడ్డు పనిని పూర్తి చేశానన్నారు. మాటాలు తక్కువగా మాట్లాడి పనులు ఎక్కువ చేసే తత్వంతో ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఎవరు ఎన్ని మాట్లాడిన అభివృద్ధి ఎజెండాగా ముందుకు వెళ్తానని పేర్కొన్నారు. మంథని ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళడమే ప్రధాన ఎజెండాగా వెళ్తానన్నారు. ఎన్నికల సమయం వరకే రాజకీయమని, అనంతరం గ్రామాల అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): ఇది పేద ప్రజల ప్రభుత్వమని, అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందించడమే అంతిమ లక్ష్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పనులు ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ బీఆర్ ఎస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రజలకు ఆశలు పెట్టి దోచుకుందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఏఎంసీ ఛైర్మ న్‌గా బాధ్యతలు చేపట్టిన వైనాల రాజు, మండల కాం గ్రెస్ అధ్యక్షుడు అన్వర్‌లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని గజమాలతో సన్మానించారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో ఆయన గుండెపోటు చికిత్స తీసుకొని రామగిరి మండలంలోని సెంటనరీకాలనీలోని ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనను పరామర్శించారు. తిరుపతి యాదవ్, సదానందం, బొంపల్లి రాజయ్య, తోట చంద్రయ్య, సమ్మయ్య, కాటన్ సత్యం, వనం రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు సవరణకు ప్రత్యేక క్యాంపు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈ నెల 5 నుంచి 8 వరకు ఆధార్ కార్డు సవరణకు ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ కోయశ్రీహర్ష తెలిపారు. ఇందులో ఎన్‌రోల్‌మెంట్, ఫింగర్ ప్రింట్స్, ఐరీష్, ఫొటోతోపాటు అడ్రస్, పేర్ల మార్పు తదితర సవరణలకు సంబంధించిన వాటికి ఆధారాలతో సంప్రదించాలని, దీనికి డబ్బులు చెల్లించాల్సినా అవసరం లేదని పేర్కొన్నారు. నూతన ఆధార్ కార్డుకు మాత్రం మీ సేవా అడ్రస్‌తో జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్, తల్లి దండ్రులలో ఒకరిది అప్‌డేట్ చేసిన ఆధార్ కార్డు ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డులో అడ్రస్ మార్పునకు ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, నివాస ధ్రువీకరణ పత్రంలో ఒకటి తప్పనిసరిగా వెంట తీసుకు రావాలని సూచించారు. ప్రత్యేక వాటికి రూ.50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



మొక్కలు నాటుతున్న అధికారులు

ఎలిగేడు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి అన్నారు. శనివారం నర్సాపూర్‌లో కొత్తిరెడ్డి మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రెండున్నర ఎకరాల ఆయిల్ పామ్ పంటను వేశారు. గతంలో ఐదు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారని తెలిపారు. లాభాలపై అవగాహనతో మల్లారెడ్డి పంటను మరింత విస్తరించినట్లు చెప్పారు. ఎకరం వరి పండించే పెట్టుబడితో మూడు ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చన్నారు. అధిక దిగుబడులతోపాటు అంతర పంటలు వేసుకునే అవకాశం ఉంటుందని, అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఏఈవో గణేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అభిలాష్ పాల్గొన్నారు.

ముర్రుపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణీలకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్, టీచర్లు

ఎలిగేడు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ముర్రుపాలతో అప్పుడే పుట్టిన బిడ్డకు ఆరోగ్యం అందు తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ తెలిపారు. శనివారం నర్సాపూర్, శివపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలనే అందించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యత విశిష్టతను మహిళలకు వివరించారు. పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. టీచర్లు హేమలత, కళావతి, స్వప్న ఉన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : బిడ్డలకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని అందులో రోగ నిరోధక శక్తి ఉంటుందని ఎంఈవో రమేష్ తెలిపారు. మడక అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో తల్లిపాలు, ముర్రుపాలు విశిష్టతను బాలింతలకు, గర్భిణులకు వివరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్ఎం అశోక్ రెడ్డి, శోభారాణి, ఏఎన్ఎం శ్రీలత, అంగన్వాడి టీచర్ బి.రాజేశ్వరి, ఆశా కార్యకర్త మహేశ్వరి, సుజాత, రజిత, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి, టీచర్ తిరుమల అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జనగామ సెక్టార్‌లో రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతం, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలింతలు పిల్లలకు తల్లిపాలను ఇవ్వాలని, డబ్బాపాలు పట్టించవద్దని, ముర్రిపాలు పిల్లలకు శ్రేయస్కరమన్నారు. సరస్వతి, హేమలత, జ్యోతి, స్వరూప, సరస్వతి పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని అప్పన్నపేట అంగన్‌వాడి కేంద్రం టీచర్ మందల విమల అన్నారు. కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. రాఘవపూర్‌లో అంగన్‌వాడి కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వాతి, అంగన్‌వాడి టీచర్ శ్రీదేవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

ముత్తారం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం ముత్తారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌లో జరుగుతున్న వైద్య పరీక్షలు, స్టాఫ్ అటెండెన్స్‌ను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయో లేదో తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎంతమంది ఔట్ పేషెంట్ వస్తున్నారో ఆరా తీశారు. ఔట్ పేషేంట్‌లలో వ్యాధి లక్షణాలు ఉంటే పరీక్షలు నిర్వహించాలని, ముందస్తుగా వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, సమయపాలన పాటించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అమరేందర్, అధికారులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని మండల పంచాయతీ అధికారి ఆరీఫ్ అన్నారు. శనివారం ఆశన్నపల్లి, కాల్వశ్రీరాంపూర్, మొట్లపల్లి గ్రామాలను పరిశీలించారు. ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న నిరంతర పారిశుధ్య కార్యక్రమాలను తెలుసుకున్నారు. ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురికి నీటి ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి, పిచ్చి మొక్కలను ట్రాక్టర్‌తో శుభ్రం చేయించారు. డాక్టర్ మహేందర్, మలేరియా అధికారి రవీందర్, హెచ్‌ఓ శ్రీనివాస్, వినీత్, కార్యదర్శులు సంజీవ్, మహేందర్ రెడ్డి, సత్యరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఏఎన్ఎం సరోజన పాల్గొన్నారు.

ప్రమోషన్ తెచ్చిన పరేషాన్...

● నెల రోజులు కార్మిక సంఘానికి దూరం

గోదావరిఖని, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డికి ఉద్యోగ పదోన్నతి పరేషాన్‌లో పడవేసింది. ఎన్‌సీడబ్ల్యూ పరిధిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న మిర్యాల రాజిరెడ్డికి ఈ-2 నుంచి ఈ-1గా ప్రమోషన్ లభించింది. ఆర్‌జీ-3 పరిధిలోని ఓసీపీ-1లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పని చేసిన ఆయన జూనియర్ ఆఫీసర్‌గా ఆర్‌జీ-3 జీఎం ఆఫీస్‌లోనే పోస్టింగ్ ఇచ్చారు. ఈ పదోన్నతి మంచిదే అయినప్పటికీ ఒక కార్మిక సంఘానికి అధ్యక్షత వహిస్తున్న వ్యక్తి అధికారి కావడం చర్చకు దారి తీసింది. అధికారిగా పదోన్నతి పొందిన రాజిరెడ్డి కార్మిక సంఘం అధ్యక్షుడిగా కొనసాగడం ట్రేడ్ యూనియన్ సాంప్రదాయాలకు విరుద్ధం. కార్మిక సంఘాల చరిత్రలో కానీ అటు సింగరేణి అధికారుల సంఘం సీఎంఓఏ వైపు నుంచి ఎవరు, ఎన్నడూ ఈ సమస్య ఎదుర్కొలేదు. రాజిరెడి ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. నెల రోజుల పాటు సంఘం కార్యకలాపాలకు దూరంగా ఉంటాడని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు చెబుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని అందుగులపల్లిలో పంచాయతీ కార్యదర్శి గీత సర్వేను చేపడుతుండగా ఎంపీడీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఓదెల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ రమేష్ అన్నారు. పొత్కపల్లి బాలికల పాఠశాలతో పాటు మడకలోని ప్రాథమికోన్నత పాఠశాలలను శనివారం ఎంఈఓ సందర్శించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి నిర్వహణ తీరు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. రిజిస్టర్లు పాఠశాలల్లోని వివిధ రకాలైన రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు శ్రద్ధతో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. సీఆర్‌పీ తిరుపతి పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

ఓదెల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కుబేర చిత్రంలోని కొడుకా అనే పాటలో నటించిన ఓదెలకు చెందిన కడేర్ల రమేష్‌ను శనివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. పాటలో పిచ్చోడిగా నటించిన రమేష్ తోపాటు నటనను చిత్రీకరించిన తోట శ్రీనివాస్, శ్రీరామోజు శ్రీనివాస్ అలాగే చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించిన అభిజిత్‌ను సన్మానించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి, వెంకటేశ్వర్లు, క్యాతం శ్రీనివాస్, మెడికల్ రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ధర్మారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చీటి స్వాతి అన్నారు. శనివారం పత్తిపాక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో యువశక్తి యూత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి మాట్లాడారు. గ్రామంలోని పత్తి గుట్ట పరిరక్షణకు ముందుకు రావాలని సూచించారు. యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు రేచవేని మహేష్, ప్రధానోపాధ్యాయుడు మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సందడి

మంథనిరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణ సందడి నెలకొంది. శ్రావణ మాసంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థుల తోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి శ్రావణమాస పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ అవరణలో సందడి నెలకొంది.

యూరియా వాడకాన్ని తగ్గించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియాను అధికంగా వాడుతున్నారని, ప్రస్తుత పంటలో మోతాదును తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పీఎం సమ్మాన్ నిధి కార్యక్రమంలో భాగంగా 20వ విడత నిధులను ప్రధాని మోదీ విడుదల చేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. పామాయిల్ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఏడిఏ శ్రీనాధ్, కెవికె రామగిరి శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ నవ్య, మండల వ్యవసాయ అధికారి అలివేణి, ఏఈవోలు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం కిసాన్ నిధులు విడుదల చేశారు. మైదంబండ, ఖమ్మంపల్లి రైతువేదికలలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం రైతులు వీక్షించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు జి.హారిక, ఎస్.శ్రీలేఖ, అనూష పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



వరి నాట్లపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అడ్డగుంటపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల్లో వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు శనివారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది. మేడి పల్లి శివారులో వ్యవసాయ క్షేత్రాన్ని విద్యార్థులు సందర్శించారు. పొలంలో రైతులు నాట్లు వేసే పద్ధతిని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. వ్యవసాయం, పంటలు, ఎరువులు, కూరగాయల పెంపకం, వాణిజ్య పంటలు అంశాలను ఉపా ధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా రైతుల సహ కారంతో నారు నాటే పనుల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస రెడ్డితోపాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జావలిన్‌త్రో పోటీలకు ఎంపిక



విద్యార్థి ప్రకాష్

సుల్తానాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జావలిన్ త్రో పోటీలలో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పట్టిపల్లి ప్రకాష్ ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. శ్రీధర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి కె.సునీల్ తెలిపారు. శనివారం సుల్తానాబాద్ కేంద్రంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు జిల్లాస్థాయి జావలిన్ త్రో పోటీలు నిర్వహించారు. పోటీలలో విద్యార్థి ప్రతిభ కనపరిచి జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

ధర్మారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ముగ్గురు మంత్రులు పర్యటించనున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులు పాల్గొననున్నారు. మండలంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి తెలిపారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యంలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఎంసి ఛైర్మెన్ లావుడ్య రూప్లా నాయక్ పిలుపునిచ్చారు. ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసాది అజయ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, నాయకులు కోదాటి అంజన్న, కాడె సూర్యనారాయణ, దేవి జనార్దన్, పాలకుర్తి రాజేశం. కాంపెల్ల రాజేశం, ఆజయ్‌పాల్‌రెడ్డి, రామగిరి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

అంతర్గాం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పెద్దంపేట గ్రామానికి చెందిన తూళ్ళ శిక్షిత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం శిక్షిత్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన తండ్రి తూల్ల రాజేష్ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ చేశారు. జర్నలిస్ట్ కోల లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు గట్టు శ్రీనివాస్, భూమేష్, మల్లేష్, పాల్గొన్నారు.

చలో గోవా పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): గోవాలో ఈ నెల 7న జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ పోస్టర్‌ను నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోట రాజ్ కుమార్ శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ మాట్లాడుతూ ఈ నెల 7న గోవాలో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలన్నారు. తాటికొండ శంకర్, కొట్టె భూమయ్య, మచ్చగిరి రాము, గర్రం లక్ష్మీమల్లు, బొమ్మగాని అనిల్, పాల్గొన్నారు.

5న రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో 2వ రాష్ట్ర జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్ ప్రకటనలో తెలిపారు. ఈ చాంపియన్ షిప్ యువ పారా అథ్లెట్లు ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల దివ్యాంగులు పాల్గొనాలని తెలిపారు.

డయాలసిస్ బాధితుడికి ఆర్థిక సహాయం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): డయాలసిస్‌తో బాధపడుతున్న శివాజీనగర్‌కు చెందిన దస్తగిరికి జాగృతి జిల్లా అధ్యక్షుడు పెంట రాజేష్ రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దస్తగిరి కొంత కాలంగా అనారోగ్యానికి గురై పని చేయలేని స్థితిలో ఉన్నాడని, . విషయం తెలుసుకుని ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్, జాగృతి నాయకులు అందె సదానందం, కుమారస్వామి, నిట్టూరి రాజు, సాయికృష్ణ పాల్గొన్నారు.

వివాహానికి సాయం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ అమూల్య వివాహానికి వేగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సహాయం అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు వేగోలపు సదయ్య పెళ్లి కూతురుకు చీరతోపాటు 50 కిలోల బియ్యాన్ని అందించారు.

ధర్నాకు తరలిన బీజేపీ నాయకులు



ధర్నాలో ఖని బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపుతుందని ఆరోపిస్తూ శనివారం హైదరాబాద్ ఇందిరాపార్కులో నిర్వహించిన ధర్నాలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, గోదావరిఖని నుంచి జేపీపీ నాయకులు తరలివెళ్లారు. లావణ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని అన్నారు. ఓబీసీల హక్కుల కోసం పోరాటం చేసేది బీజేపీయేనని అన్నారు. కానిపేట శివాజీ, పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, నవీన్, సంపత్‌రావు, దాసరి శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, సంపత్, రాకేష్, కమల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



పరీక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

సుల్తానాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ పరిధిలో పారిశుధ్య కార్మికులకు, నీటి సరఫరా సిబ్బంది, బిల్ కలెక్టర్‌లకు, ఆర్‌పీలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. మేనేజర్ అలీమొద్దిన్, ఏఈ రాజ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

గోదావరిఖని, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన నేపథ్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 5, 6తేదీలలో జిల్లాలో పర్యటిస్తారని, నాయకులు కార్యకర్తల సమన్వయంతో పర్యటనను జయప్రదం చేయాలన్నారు. పవన్, సుభాష్, ఉరగొండ అపర్ణ, భూమన్న, రమేష్ పాల్గొన్నారు.



ఆర్జీ-2లో క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా, 11 ఇంక్లయిన్, ఓసీపీ-1 క్వార్టర్లు లేని ఉద్యోగులకు కాలనీలో క్వార్టర్‌ల కేటాయించేందుకు శనివారం సీఈఆర్ క్లబ్‌లో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. క్వార్టర్లు లేని వారికి, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కోసం కౌన్సెలింగ్ జరిగింది. 518 క్వార్టర్లకు గాను 114 మంది దరఖాస్తు చేసుకోగా 48 మంది హాజరయ్యారు. వారిలో 42 మందికి డీజీఎం పర్సనల్ అరవిందరావు క్వార్టర్‌లను కేటాయిస్తూ అలాట్‌మెంట్, లెటర్లు అందజేశారు. కౌన్సెలింగ్‌లో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, డీవైపీఎం వేణుగోపాల్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, క్వార్టర్ సెక్షన్ ఇన్‌చార్జి మమత పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఉత్పత్తి 108 శాతం



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా జూలై నెలలో 108 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య తెలిపారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో జీఎం ఉత్పత్తి, రవాణా ఓబీ వివరాలను తెలియపారు. జూలై నెల నిర్దేశిత లక్ష్యం 6,80,500 టన్నులు కాగా 7,31,702 టన్నుల బొగ్గు ఉత్పత్తి(108 శాతం) జరిగినట్టు జీఎం పేర్కొన్నారు. ఓబీ వెలికితీత లక్ష్యం 39 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 39.80 లక్షల క్యూబిక్ మీటర్లు (102శాతం) వెలికితీసినట్టు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 19.87 లక్షలకు గాను 26.57 లక్షలు (134శాతం) సాధించినట్టు జీఎం తెలిపారు. 97 శాతం ఓబీ వెలికితీత జరిగిందన్నారు. జూలై నెలలో సీహెచ్‌పీ నుండి 7.17 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. జూలైలో ఆర్జీ-2 ఏరియా సింగరేణిలో అత్యధిక ఉత్పత్తి సాధించిన ఏరియాగా నిలిచినట్టు జీఎం పేర్కొన్నారు.

మెడికల్ బోర్డును మళ్ళీ నిర్వహించాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గత నెల 30న నిర్వహించిన సింగరేణి మెడికల్ బోర్డు ఫలితాలు కార్మికులకు అన్యాయం చేసే విధంగా ఉందని, మళ్ళీ మెడికల్ బోర్డును నిర్వహించాలని ఓసీపీ-1లో ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి మాట్లాడారు. 9 నెలలుగా 52 మంది కార్మికులకు జీతాలు రాకుండా పెండింగ్‌లో పెట్టి అందులో ఐదుగురిని మాత్రమే ఇన్వాలిడేషన్ చేయడంతో కార్మికులకు అన్యాయం చేసినట్టు పేర్కొన్నారు. ఫిట్ అయితే తొమ్మిది నెలల క్రితమే నిర్ధారణ చేసి ఉంటే 47 మంది కార్మికులు ఒక్కొక్కరు 10 లక్షల వరకు వేతనాలు నష్టపోయి ఉండేవారు కాదని తెలిపారు. మెడికల్ బోర్డు నిర్వహణపై కార్మికులో అనుమానాలు నెలకొన్నాయని, మళ్ళీ మెడికల్ బోర్డు నిర్వహించి కార్మికులను ఇన్వాలిడేషన్ చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు పారదర్శకంగా జరిగేలా ప్రతి ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సయ్యద్ సలీం, జక్కుల చంద్రయ్య, రవికుమార్, శశి, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరావు, సంపత్, ఉన్నారు.